ధోబీఘాట్ స్థలాన్ని అప్పగించండి


కలెక్టర్ గౌతంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

గౌతంనగర్: జ్యోతినగర్‌లోని ధోబీఘాట్ స్థలాన్ని అప్పగించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతంను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా రజకులు ధోబీఘాట్ ఏర్పాటు చేసుకుని అక్కడే తమ కుల వృత్తి చేసుకునేవారన్నారు. అయితే గతంలో ధోబీఘాట్‌ని అధునాతన సౌకర్యాలతో నిర్మించి ఇస్తామని జీహెచ్ఎంసీ అధికారులు రజకులను కోరడంతో కూల్చివేశారన్నారు. అనంతరం చుట్టూ ప్రహరీ నిర్మించిన తర్వాత స్థానిక కాలనీవాసులు ఈ స్థలం కాలనీకి చెందిందని అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. అదేవిధంగా ధోబీఘాట్‌లో ఏర్పాటుచేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూడా గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రజకులకు తాను అండగా ఉంటానని అవసరమైతే హైకోర్టుకు వెళ్లి ధోబీఘాట్‌ను అప్పగించే వరకు పోరాటం చేస్తానన్నారు. వెంటనే అధికారులు సర్వే చేసి రజకులకు స్థలాన్ని అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ పరిధిలోకి మహంకాళి ఆలయం


ఆలయ ఆవరణలోఎండోమెంట్ అధికారులు

ఉప్పల్: ఉప్పల్ మహంకాళి ఆలయాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఆలయ నిర్వహణపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అసిస్టెంట్ దేవాదాయ కమిషనర్ శేఖర్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్లు ప్రణీత్ కుమార్, మోహన్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఈవోలు ఆలయానికి వచ్చి తనిఖీలు నిర్వహించి హుండీని సీజ్ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. 'కావాలనే కొందరు ఫిర్యాదు చేశారని, సొంత నిధులతో గుడిని నిర్మించి అభివృద్ధి చేశామని.. పంతుళ్లకు జీతాలు తామే ఇస్తాం' అని ఆలయ నిర్వాహకుడు మహంకాళి లక్ష్మణ్ తెలిపారు.

హోటళ్లలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు హోటళ్లను జీహెచ్ఎంసీ ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. కొన్ని కిచెన్‌ల్లో బొద్దింకలు తిరుగుతూ.. మూతలు లేని ఆహార పదార్థాలు వండి నేల మీదనే వేసిన దృశ్యాలను అధికారులు గుర్తించారు. వీటితో పాటు ఫ్రిజ్‌ల్లో నిల్వ చేసిన ఆహార పదార్థాలనే తిరిగి వేడి చేసి వడ్డిస్తున్నారని నిర్ధారించి దాదాపు అన్ని హోటళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.


ఉప్పల్‌లోని ఓ ప్రముఖ హోటల్ కిచెన్ దుస్థితి

వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు


12.5ఎంవీఏ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్ఈ బ్రహ్మం

బోడుప్పల్: వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ను అందిస్తామని ఎస్ఈ పి.బ్రహ్మం అన్నారు. బోడుప్పల్‌లోని సబ్‌స్టేషన్‌లో ఆయన 12.5 ఎంవీఏ, పీటీఆర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బోడుప్పల్ వాసులకు 8 ఎంవీఏ ఇస్తుండగా విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగిందని, వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 12.5 ఎంవీఏకు పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈలు సుబ్బారావు, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, ఏడీఈ బాలకృష్ణ, ఏఈలు వినయ్‌కుమార్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

మల్కాజిగిరి: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆనంద్‌బాగ్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే పారిశుధ్య కార్మికులకు ఎంఎస్ఎస్ఓ ద్వారా చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్, నాయకులు వెంకటేశ్‌యాదవ్, సతీశ్‌కుమార్, నిరంజన్, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ సర్కిల్ కార్యాలయం..

అల్వాల్: అల్వాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్వాల్ సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై కేక్ కట్ చేసి పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్, కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, బొబ్బిలి సురేందర్‌రెడ్డి, యాదగిరి, కొండల్‌రెడ్డి, సూర్యకిరణ్, రాజసింహారెడ్డి, కృష్ణగౌడ్, నాగేశ్వర్‌రావు, బలవంతరెడ్డి, భాస్కర్, శివ, శకుంతలనాయుడు, బబిత, జ్యోతి, పద్మ, కవిత, నిర్మల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న మైనంపల్లి హన్మంతరావు

విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఎస్సీ అభివృద్ధి అధికారి వినోద్ కుమార్


హాజరైన ప్రిన్సిపాళ్లు


మాట్లాడుతున్న జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్‌కుమార్

సాక్షి,సిటీబ్యూరో: ఫీజు బకాయిలు ఉన్నాయని డిగ్రీ, ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ ఎస్సీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారిని ఇబ్బందులు కలిగించవద్దని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల్లో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాల ఆన్‌లైన్ నమోదుపై కాలేజీల ప్రిన్సిపాళ్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్ షిప్‌లు కొంత ఆలస్యంగానైనా కాలేజీ అకౌంట్లలో జమ అవుతాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు.ప్రతి కాలేజీలో ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించేందుకు బాధ్యత గల సిబ్బందిని నోడల్ ఆఫీసర్‌గా నియమించాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలని, ఏమైనా పొరపాట్లు జరిగితే నోడల్ ఆఫీసర్లదే బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థుల ఆధార్ నంబర్లను బ్యాంక్ అకౌంట్‌తో సీడింగ్ చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీజీజీ ప్రతినిధి వినయ్‌కృష్ణ అవగాహన కల్పించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

బోడుప్పల్: సందీప్ చారిటబుల్ ట్రస్ట్, ఆర్‌బీఎం , లోరా హాస్పిటల్స్, మై ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో సరస్వతీనగర్ కాలనీలోని రాపోలు రాములు ఇంటి వద్ద ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ ముఖ్య సలహాదారులు వెంకట్‌రావు, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బోడుప్పల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫెడరేషన్ చైర్మన్ రాపోలు రాములు జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. షుగర్, బీపీ, ఈసీజీతోపాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

వ్యక్తి అదృశ్యం


ఆనంద్

మల్కాజిగిరి: వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. హిల్‌టాప్ కాలనీకి చెందిన ఆనంద్ (31) మేస్త్రీ పని చేస్తున్నాడు. గత నెల 21న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. గతంలో కూడా ఇలా వెళ్లి రెండు, మూడు రోజుల తర్వాత వచ్చేవాడు. అయితే ఈసారి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికినా ఫలిత లేకపోవడంతో ఆనంద్ భార్య సునీత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శివసాయినగర్ కోర్టు లైన్‌లో సీసీ రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, ఏఈ సత్యలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాఘవ, పంజా శ్రీనివాస్, రామకృష్ణ, రాకేశ్, శివ, బీజేపీ నాయకులు ఓంప్రకాశ్, జ్యోతి, మల్లేశ్ యాదవ్, సాయి, సురేశ్, శ్రీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెంటయ్యయాదవ్‌కు నివాళి

బోడుప్పల్: బోడుప్పల్ ఒకటో డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్ తండ్రి పెంటయ్య యాదవ్ శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేయర్ అజయ్ యాదవ్ పెంటయ్యయాదవ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంటయ్య యాదవ్ గతంలో చెంగిచర్ల వార్డు సభ్యుడిగా పని చేసి స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించారని గుర్తు చేశారు. ఆయన వెంట పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్ల నిలిపివేత తగదు


కలెక్టర్ గౌతంకు వివరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి పరిధిలోని కొన్ని సర్వే నంబర్లలో నిర్మాణంలో ఉన్న ఇండ్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలన్న వక్ఫ్ బోర్డు సీఈవో ప్రకటనపై పునరాలోచించాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ గౌతం పోత్రుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 750 ఎకరాల్లో సుమారు 72 పైగా కాలనీలు ఏర్పడ్డాయని వాటిలో పేద, మధ్య తరగతి ప్రజలు ఇండ్లు నిర్మించుకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం కూడా మౌలిక వసతులు కల్పించిందన్నారు. వక్ఫ్ భూముల పరిరక్షణకు తాను వ్యతిరేకం కాదని, అయితే అక్కడ దశాబ్దాలుగా ఉన్న పేదప్రజలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చూడాలని కోరారు.

యువత మత్తుకు బానిసవ్వొద్దు

మేడ్చల్ రూరల్: యువత డ్రగ్స్, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ సీతారాం సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ గ్రూప్స్ ఆడిటోరియంలో శుక్రవారం యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల(డ్రగ్స్) దుర్వినియోగం , అక్రమ రవాణా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సీతారాం మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలకు బానిసై యువత పెడదారిన పడుతూ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ హరిశ్చంద్రారెడ్డి, సుబ్బరాంరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, గోపి, మేడ్చల్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగోల్ మెట్రోస్టేషన్ పార్కింగ్ వద్ద ఆందోళన

ఉప్పల్: పార్కింగ్ దోపిడికి నిరసనగా నాగోల్ మెట్రో పార్కింగ్ స్థలం వద్ద ప్రయాణికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల పార్కింగ్‌కు 12 గంటల వరకు రూ. 25 వసూలు చేస్తున్నారని అది దాటితే గంటకు రూ. 5 చొప్పున వసూలు చేస్తున్నారని, ఇదేంటని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ స్థలంలో సరైన వసతులు కల్పించిన తర్వాతే పార్కింగ్ ఫీజును నామమాత్రంగా తీసుకోవాలని, అలా కాకుంటే అన్ని స్టేషన్లలో పార్కింగ్ ఫీజును రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

షవర్మ తిని ఆరుగురికి అస్వస్థత

అల్వాల్: ప్రజల ఆరోగ్యంతో హోటల్ నిర్వాహకులు చెలగాటం ఆడుతున్నారు. తాజాగా అల్వాల్ లోతుకుంటలో షవర్మ తిని ఆరుగురు ఆసుపత్రి పాలయ్యారు. వివరాలకు వెళ్తే.. రాజీవ్ రహదారి లోతుకుంటలోని షవర్మ తిని ఓల్డ్ ఆల్వాల్ సూర్య నగర్కు చెందిన రాజు, రాము, శివ, రాకేశ్, సతీశ్, హరీశ్ అస్వస్థత గురయ్యారు. వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. అయితే ఇదే కేంద్రంలో ఇలాంటి ఘటన జరగడం ఇది మూడోసారి. ఈ ఏడాది జనవరిలో షవర్మ తిని 20 మంది అస్వస్థతకు గురయ్యారు. విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆహార భద్రత అధికారులు షవర్మలో అనారోగ్యానికి గురి చేసే రసాయనాలు ఉన్నాయని గుర్తించి విక్రయ కేంద్రాన్ని మూసివేశారు. అయితే కొంతకాలం తర్వాత మళ్లీ తెరిచారు. 2 నెలల క్రితం మరికొందరు అస్వస్థతకు గురి కావడంతో దుకాణం లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కానీ కొద్దిరోజులుగా మళ్లీ వ్యాపారం ప్రారంభించింది. తాజాగా శుక్రవారం పాత సంఘటననే పునరావృతం అయింది. ఇందుకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని స్థానికులు ఆరోపిస్తునారు. బాధితులు సైతం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులను వివరణ కోరగా షవర్మ విక్రయ కేంద్రానికి గతంలోనే నోటీసులు ఇవ్వడంతో పాటు జరిమానా సైతం విధించామని తెలిపారు.

ఘనంగా ఛట్ పూజ

మేడ్చల్: దీపావళి తర్వాత ఉత్తర భారతీయులు ఘనంగా జరుపుకునే ఛట్ పూజా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు.మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి బుడమ కుంట వద్ద శుక్రవారం ఉదయం సూర్యోదయానికి ముందు, సాయంత్రం సూర్యస్తమయానికి ముందు గంగమ్మ తల్లి వద్ద పూజలు చేశారు.

పాల్గొన్న ఎంపీ ఈటల..

అత్వెల్లి చెరువు వద్ద శుక్రవారం నిర్వహించిన ఛట్ పూజల్లో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు.


పూజల్లో ఎంపీ ఈటల రాజేందర్


అత్వెల్లి చెరువు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2, పలు ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఈనెల 9న (నేడు) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాసవీశివనగర్, నాగర్జున నగర్ 11 కేవీ ఫీడర్ల పరిధిలోని వాసవీశివనగర్, వైష్ణవి ఎన్‌క్లేవ్, మారుతీ ఎన్‌క్లేవ్, శుభోదయకాలనీ, విస్టా హోమ్స్, గణేశ్‌నగర్, సాయినగర్, ఎస్ఎస్ కాలనీ రోడ్డు నెంబరు–1,2 ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పీఎస్ కాలనీ ఫీడర్ పరిధిలో..

రామంతాపూర్ : పీఎస్ కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఈనెల 9న (నేడు) పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాములు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పీఎస్ కాలనీ శ్రీనివాసపురం మధురానగర్, గోకుల్‌నగర్, గణేశ్‌నగర్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధి అశోక్‌నగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నెహ్రూనగర్, అశోక్‌నగర్ హెచ్‌సీఎల్ కేబుల్స్, మర్రిగూడ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధి కార్తికేయ నగర్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. కార్తికేయనగర్, మెయిన్ రోడ్ నాచారం, 11 కేవీ వైజయంతి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 వరకు కొండిన్యనగర్, వీరారెడ్డినగర్, అంబేడ్కర్ నగర్, వైజయంతి థియేటర్ మెయిన్‌రోడ్, రవీంద్ర నగర్ కాలనీలో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సైనిక్‌పురి సబ్ స్టేషన్ పరిధిలో ..

కాప్రా: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాలివాహన, జనప్రియ ఫీడర్ల పరిధిలో అశోక్‌కాలనీ, దాబా గార్డెన్, గౌరినాథ్ పురం, గౌడపురికాలనీ, కాప్రా, కృష్ణానగర్ కాలనీ, మహ్మదీయ కాలనీ, పద్మరావునగర్, ఎస్టీ కాలనీ, సాయిప్రియకాలనీ, శాలివాహన ఎన్‌క్లేవ్, సిల్వర్‌క్రెస్ట్, తిరుమల ఆరెంజ్, తల్లాబాయ్, ఎల్లారెడ్డిగూడ, హైటెక్‌నగర్, శ్రీకాలనీ, మనోజ్ ఎన్‌క్లేవ్, బంజారాకాలనీలో ఉదయం 11.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉప్పల్ బగాయత్ పరిధిలో ..

ఉప్పల్: ఉప్పల్ బగాయత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు. 11 కేవీ దేవేందర్ నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దేవేందర్‌నగర్, లక్ష్మీనారాయణ కాలనీ, ఉప్పల్ పారిశ్రామిక వాడ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు శిల్పారామం, బాగాయత్, డీ–మార్టు లేన్, నాగోల్ మెట్రో లేన్, గ్రీన్ విచ్ అపార్టుమెంట్, భారత్ పెట్రోల్ పంపు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వివాహ వేడుకలో ఎంపీ ఈటల

మల్కాజిగిరి: మల్కాజిగిరి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు యాదగిరి ముదిరాజ్ కొడుకు వివాహం శుక్రవారం జరిగింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, శోభన్‌బాబు పెళ్లికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. (08ఎంకెజీ33) నూతన వధూవరులతో ఎంపీ ఈటల రాజేందర్

నాలా పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ సర్దార్ వల్లాభాయి పటేల్‌లో రూ 60 లక్షలతో చేపట్టిన నాలా పనులను కార్పొరేటర్ శ్రవణ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షానికే ముంపునకు గురయ్యేదని, నాలా పనులు పూర్తయితే సమస్య పరిష్కారమవుతుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, శ్రీకాంత్, సుబ్బారావు, శంకర్, సులోచన పాల్గొన్నారు.

జడ్చర్లకు చేరిన అయ్యప్ప స్వాముల పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్పస్వాములు

కుషాయిగూడ: శబరిమలకు బయలుదేరిన అయ్యప్పస్వాముల బృందం పాదయాత్ర కొనసాగుతోంది. వేణుగోపాల గురుస్వామి శిష్యబృందం, గురుస్వామి వంగేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 5 నగరం నుంచి మొదలుపెట్టారు. శుక్రవారం జడ్చర్లకు చేరుకున్నట్లు స్వాములు తెలిపారు. డిసెంబర్ 13 వరకు శబరిమలకు చేరుకుంటామని గురుస్వామి నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జ్యోతి దర్శనం అనంతరం తిరిగి నగరానికి ప్రయాణమవుతామన్నారు. బృందంలో కొకుట్ల ప్రభాకర్‌రెడ్డి, దాసరి వెంకట్‌రెడ్డి, శివ, సునీల్, భాస్కర్, వంశీ, సంతోష్‌రెడ్డి, బాలు యాదవ్ స్వామి ఉన్నారు.

ప్రణాళికతో చదివితేనే లక్ష్య సాధన


కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

రామంతాపూర్ : ప్రణాళికతో చదివితేనే అనుకున్నది సాధించవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. గణేశ్‌నగర్‌లోని అటామానాస్ అరోరా పీజీ కళాశాలలో నూతన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడుతూ చదువుతో పాటు వినూత్న ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిజిటల్ ఫార్మేషన్ ఉన్నతాధికారి వారణాసి విజయభాస్కర్, టెక్ సొల్యూషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రవణ దేవరాజ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ డీ కిరణ్‌కుమార్, డ్రిలి ట్రక్ అధినేత అన్నమనేని అజయ్ బాబు, కళాశాల సెక్రటరీ డాక్టర్ నిమ్మటూరి రమేశ్‌బాబు, చైర్మన్ అన్‌దీప్, డైరెక్టర్ ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అల్వాల్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, నియమాలు, రోడ్లపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అల్వాల్ సెయింట్ మైఖెల్ స్కూల్‌లో విద్యార్థులకు కార్టూన్ వీడియోస్ ద్వారా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తే వారు భవిష్యత్‌లోనూ గుర్తుంచుకుంటారన్నారు. కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పోలీసులు, స్కూల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి అరెస్ట్


బీగాల శంకర్

మల్కాజిగిరి: ఆటో చోరీ కేసులో పాత నేరస్తుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. బీగాల శంకర్ (34) చెత్త కాగితాలు ఏరుకుంటూ మల్కాజిగిరి సాయి బాబానగర్‌లో ఫుట్‌పాత్ పైన నివసిస్తున్నాడు. గతంలో సుమారు 10 దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లాడు. ఈనెల 2న జైలు నుంచి వచ్చాడు. ఇదే నెల 7న మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాల వద్ద పార్కింగ్ చేసిన ఆటోను దొంగలించాడు. శుక్రవారం అతనిని మల్కాజిగిరిలో అరెస్ట్ చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. 24 గంటల్లోనే నేరస్తుడిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ శ్రీశైలం, డీఎస్ఐ శంకరయ్యను డీసీపీ పద్మజ అభినందించి రివార్డు ప్రకటించారు.

ఎస్పీ భారతికి అంతర్జాతీయ అవార్డు



గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ సభ్యురాలు, నాట్య గురువు డాక్టర్ ఎస్పీ భారతికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ అవార్డు మెల్విన్ జోన్ ఫెలో (ఎంజేఎఫ్) లభించింది. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో లయన్స్ ది గవర్నర్ ఆఫ్ డిస్ట్రిక్ట్–320–హెచ్ లయన్ ఎన్.మనోహర్‌రెడ్డి, లయన్ ఎస్.నరేందర్‌రెడ్డి చేతులమీదుగా ఆమె అవార్డు అందుకున్నారు.